రూ.4.50 కోట్లతో చినవెంకన్న ఆలయ అభివృద్ధి పనులు

ద్వారకాతిరుమల:ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా మొత్తం 60 అంశాలకు సంబంధించి జరిగిన ఆలయ ట్రస్ట్‌బోర్డు సమావేశంలో సభ్యులు ఆమోదించిచారని ఆలయ ఇఒ వేండ్ర త్రినాథరావు తెలిపారు. ఆలయ ఛైర్మన్ ఎస్‌వి.సుధాకరరావు అధ్యక్షతన జరిగిన ట్రస్ట్‌బోర్డు సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఇఒ వివరాలను వెల్లడించారు. ప్రధాన ఆలయానికి 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.135 కోట్ల బడ్జెట్, వివిధ ట్రస్ట్‌లకు రూ.20 కోట్ల బడ్జెట్ ఆమోదించారన్నారు. ఫిబ్రవరి 2023 నెల ఆదాయ వ్యయాలు, కేంద్రీయ గిడ్డంగులకు అవసరమైన అప్పునిచ్చు, వస్త్రాల కొనుగోలు టెండర్లు, దేవస్థాన భద్రతా చర్యల్లో భాగంగా వంద సీసీ కెమెరాల ఏర్పాటుకు సమావేశంలో సభ్యులు ఆమోదం తెలిపారని చెప్పారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ఉపాలయమైన శివాలయానికి గోపురం, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.2 కోట్లు 72 లక్షల టెండర్ ఆమోదించారన్నారు. అలాగే 34 అభివృద్ధి పనులకు సంబంధించి సుమారు రూ.నాలుగు కోట్ల 50 లక్షల పనులు ఆమోదించినట్లు ఇఒ తెలిపారు.

అన్నదాత ఆందోళన..!

వేసవిలోనూ వీడని వర్షాలు
పంటలపై తీవ్ర ప్రభావం
పొగాకు, మామిడి, మొక్కజొన్న రైతులు గగ్గోలు
వడగళ్ల వానతో జీలుగుమిల్లి మండలంలో 150 ఎకరాల్లో పొగాకు బుగ్గి
వరి దిగుబడిపై ప్రభావం చూపనున్న వర్షాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వేసవికాలంలో కురుస్తున్న అకాల వర్షాలతో అన్నదాత తీవ్ర ఆందోళనకు గురవుతున్నాడు. చేతికొచ్చిన పంట కళ్లముందే దెబ్బతినడం చూసి కన్నీరుమున్నీరవుతున్నాడు. ఇప్పటికే వ్యవసాయం భారంగా మారి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను ప్రకృతి వైపరీత్యాలు మరింత కుంగదీస్తున్నాయి. గడిచిన వారం రోజులుగా జిల్లాలో అకాల వర్షాలు పడుతూనే ఉన్నాయి. గురువారం సైతం ఏలూరు జిల్లాలో నూజివీడు, లింగపాలెం, పెదవేగి, ఏలూరు, పెదపాడు, ద్వారకాతిరుమల, ముదినేపల్లి, ముసునూరు, కైకలూరు, కలిదిండి తదితర మండలాల్లో సరాసరిన 2.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గడిచిన బుధవారం 2.1 మిల్లీమీటర్లు, మంగళవారం 6.6 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. ఈదురుగాలులు, వడగళ్ల వాన భీభత్సం సృష్టిస్తున్నాయి. జిల్లాలో దాదాపు 25 వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో పొగాకు సాగవుతోంది. పనల మీద కొంత పంట ఉండగా కోత దశలో మరికొంత ఉంది. జీలుగుమిల్లి మండలంలో వడగాళ్ల వానలకు మునగలంపల్లి గ్రామంలో దాదాపు 150 ఎకరాల్లో పంట దెబ్బతింది. వర్షాలకు పొగాకు ఆకులన్నీ దెబ్బతిన్నాయి. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి, కౌలు నిమిత్తం రూ.20 వేలు ఖర్చు చేశారు. పంటంతా దెబ్బతినడంతో పొగాకు రైతులకు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. పొగాకు సాగులో అత్యధికం కౌలురైతులు ఉండటంతో వారంతా లబోదిబోమంటున్నారు. మొక్కజొన్న పంట సైతం పక్వానికి వచ్చి కోతకు సిద్ధంగా ఉంది. ఈదురుగాలులకు పంట నేలకొరిగిపోవడం, పొత్తుల్లోకి వర్షపు నీరు వెళ్లడంతో పంట దెబ్బతినే పరిస్థితి నెలకొంది. జిల్లాలో దాదాపు లక్ష ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోంది. రైతులు పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టారు. పంట చివరి దశకు చేరుకున్న తరుణంలో వెంటాడుతున్న వర్షాలు అన్నదాతకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పంట దెబ్బతినే పరిస్థితి నెలకొనడంతో కౌలురైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఏలూరు జిల్లాలో 50 వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో మామిడి సాగవుతోంది. వర్షాలకు, గాలులకు పిందె దశలో ఉన్న పంటంతా రాలిపోతుంది. వర్షాలకు పూత దెబ్బతింటున్న పరిస్థితి ఏర్పడింది. దీంతో మామిడి రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. అంతంతమాత్రంగా ఉన్న వ్యవసాయం ప్రకృతి వైపరీత్యాలతో మరిన్ని నష్టాలను మిగులుస్తోంది. దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం ఇచ్చే పరిహారం సైతం సాగు చేసే కౌలురైతులకు అందడం లేదు. దీంతో కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

జీలుగుమిల్లి మండలంలో వడగండ్ల వానకు దెబ్బతిన్న పొగాకు పంట

వరి దిగుబడిపై తీవ్ర ప్రభావం

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వరి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపనున్నట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం వరి పంట ఈనిక, పొట్ట దశలో ఉంది. ఈ తరుణంలో కురుస్తున్న వర్షాల వల్ల 50 బస్తాల దిగుబడి వచ్చే పొలం సైతం 40 బస్తాలు రావడం గగనంగా మారనుంది. ఈనిక దశలో కంకులపైన ఉండే సొంపు వర్షాలకు రాలిపోతుంది. సొంపు రాలిపోతే కంకులు పూరిస్థాయిలో పాలుపోసుకునే అవకాశం ఉండదు. దీంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడనుంది. అంతేకాకుండా దోమపోటు ఇబ్బంది ఉండనే ఉంది. రెండు జిల్లాల్లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. దాదాపు 75 శాతం సాగు కౌలురైతుల చేతుల్లోనే ఉంది. ఎకరాకు రూ.40 వేల వరకూ పెట్టుబడి పెట్టారు. దిగుబడి తగ్గితే రైతులకు పెట్టుబడులు రావడం కూడా గగనంగా మారనుంది. దీంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

వర్షాలకు 12 ఎకరాల్లో పొగాకు దెబ్బతింది

సింహాద్రి శ్రీనివాసరావు, పాములవారిగూడెం

'మాది జీలుగుమిల్లి మండలం పాములవారిగూడెం. 12 ఎకరాలు కౌలుకు తీసుకుని పొగాకు సాగు చేశాను. ఇటీవల కురిసిన వడగళ్ల వానకు పొగాకు పంటంతా దెబ్బతింది. ఎకరాకు కౌలుకు కాకుండా రూ.లక్ష 20 వేలు వరకు పెట్టుబడి పెట్టాను. పంట చేతికొచ్చే సమయంలో కురుస్తున్న వర్షాలతో తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ప్రభుత్వం ఆదుకుని పొగాకు రైతులకు న్యాయం చేయాలి.

ఎంఎల్ఎ కోటాలో ఎంఎల్సిగా జయమంగళ

రెండో ప్రాధాన్యత ఓటుతో గెలుపు - తొలుత ఓడినట్లు ప్రచారం - పంచుమర్తి అనురాధ గెలుపుతో టిడిపి నేతల్లో జోష్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎంఎల్ఎ కోటా ఎంఎల్సి ఎన్నికల్లో వైసిపి తరపున జయమంగళ వెంకటరమణ విజయం సాధించారు. నాటకీయ పరిణామాల మధ్య ఆయన గెలుపొందారు. వైసిపి నుంచి పోటీ చేసిన ఏడుగురు ఎంఎల్సి అభ్యర్థులకు ఒక్కొక్కరికి మొదటి ప్రాధాన్యత ఓటుగా 22 ఓట్లు రావాల్సి ఉండగా జయమంగళకు, మరో ఎంఎల్సి అభ్యర్థి కోలా గురువులకు 21 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో జయమంగళకు వైసిపి ఎంఎల్ఎలు ఝలక్ ఇచ్చారంటూ ప్రచారం సాగింది. దీంతో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు సందర్భంగా కోలా గురువులు గెలిచినట్లు ముందు ప్రచారం సాగింది. కొద్దిసేపటి తర్వాత రెండోప్రాధాన్యత ఓటుతో జయమంగళ గెలిచినట్లు అధికారికంగా ప్రకటించారు.

టిడిపిని వీడి వైసిపి నుంచి గెలుపు

జయమంగళ వెంకటరమణ రాజకీయ జీవితం అంతా టిడిపిలోనే కొనసాగింది. అనూహ్యంగా ఎంఎల్సి ఎన్నికల ముందు వైసిపిలో చేరి ఎంఎల్సిగా గెలుపొందారు. 2004లో టిడిపి తరపున జెడ్‌పిటిసిగా జయమంగళ గెలిచారు. 2009 ఎన్నికల్లో టిడిపి తరపున ఎంఎల్ఎ అభ్యర్థిగా కైకలూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచారు. 2014లో జయమంగళ టిక్కెట్ ఆశించి నప్పటికీ బిజెపి, టిడిపి పొత్తులో భాగంగా కామినేని శ్రీనివాస్ బిజెపి తరపున కైకలూరు నుంచి పోటీ చేసి గెలిచారు. 2019లో మళ్లీ టిడిపి తరపున జయ మంగళ పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఆయన పని చేస్తున్నారు. ఎంఎల్సి ఎన్నికల ముందు అనూహ్యంగా జయమంగళ ఎంఎల్సి పదవి హామీతో వైసిపిలో జంప్ అయ్యారు. ఎంఎల్ఎ కోటా ఎన్నికల్లో ఎంఎల్సిగా వైసిపి తరపున పోటీచేశారు. గురువారం జరిగిన ఎన్నికల్లో జయమంగళ వెంకటరమణ ఎంఎల్సిగా గెలుపొందారు.

అనురాధ గెలుపుతో టిడిపి శ్రేణుల్లో జోష్

ఎంఎల్ఎ కోటా ఎంఎల్సి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పంచుమర్తి అనురాధ గెలుపొందడంతో టిడిపి శ్రేణుల్లో జోష్ నెలకొంది. ఎంఎల్సి ఎన్నికల్లో కొనసాగిన ఉత్కంఠే అందుకు కారణంగా చెప్పొచ్చు. క్రాస్‌ఓటింగ్ జరగడంతో జయమంగళ వెంకటరమణ గెలుపుపై దోబూచులాట నెలకొంది. రెండో ప్రాధాన్యతా ఓటుతో గెలవడంతో జయమంగళ ఊపిరి పీల్చుకున్నారు.

ఆక్రమణలోని దళితుల భూములు అప్పగించండి

రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - దెందులూరు

భూస్వాముల నుండి భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం, దోసపాడు భూ పోరాట కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం దోసపాడులో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి మాట్లాడుతూ అసైన్డ్, సీలింగ్, గయాళ భూములను 25 ఏళ్లుగా దేవినేని భాజీప్రసాద్, ఆయన అనుచరులు, బినామీలను పెట్టి దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు భూములను అప్పగించాల్సిన జిల్లా రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పోలీస్ యంత్రాంగం, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై లంచాలు బొక్కి దళితులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసైన్మెంట్ చట్టం ప్రకారం భూములు దళితులకు చెందినవేనని, కానీ కలెక్టర్, జాయింట్ కలెక్టర్, రెవెన్యూ శాఖ అధికారులు ఈ విషయాన్ని పక్కన పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 10 నెలల నుంచి పేదల భూములు పేదలకు ఇవ్వాలని కోరుతున్నా కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. చట్ట ప్రకారం పేదలకు చెందిన భూములు పేదలకు ఇవ్వాలని కోరారు. అక్రమంగా భూములు అనుభవిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 25న సిఎం జగన్ దెందులూరు పర్యటనలో భాగంగా దోసపాడు పేదల గురించి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టే విధంగా కలెక్టర్, రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖ అధికారులకు ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వ్యకాస జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ దోసపాడులో 144, 145 సెక్షన్ ఎత్తివేయాలని, భూస్వాముల నుండి భూములు స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని కోరారు. సిఎం జగన్ జిల్లా పర్యటనలో భాగంగా దోసపాడు పేదలకు జరిగిన అన్యాయంపై మాట్లాడాలని కోరారు. జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశాలను అధికారులు, రాజకీయ నాయకుల, అమలు చేయడం లేదని మండిపడ్డారు. అధికారులు భూస్వాములకు కొమ్మకాస్తూ పేదలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలో పేదలకు చెందిన ప్రభుత్వ భూములు 16 రకాలున్నాయని వాటిలో అసైన్మెంట్ భూములు దోసపాడు, కొవ్వలి, పోతునూరు గ్రామాల్లో వందల ఎకరాలను భూస్వాములు ఆక్రమించుకుని అక్రమంగా అనుభవిస్తున్నారని మండిపడ్డారు. జిల్లా అధికారులు స్పష్టమైన రాతపూర్వక హామీలు ఇస్తేనే ఈ దీక్షలు ఆపుతామని లేని పక్షంలో మరోమారు భూముల్లోకి వెళ్లి చేపలు పట్టే కార్యక్రమం చేస్తామని తెలిపారు. ఈ దీక్షలో జిల్లా కమిటీ సభ్యులు పి.ఆనందరావు, మండల నాయకులు డి.నాగేంద్ర, కుమారి, లక్ష్మి, మాణిక్యం, దీవెనమ్మ కూర్చున్నారు. మరో 50 మంది వీరికి మద్దతుగా దీక్షలో పాల్గొన్నారు.

దీక్షలో పాల్గొన్న దళితులు, నేతలు

వర్జీనియా పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

జంగారెడ్డిగూడెం:మెట్ట ప్రాంతంలో అత్యధిక ప్రాధాన్యత కలిగిన వాణిజ్య పంట వర్జీనియా పొగాకు అమ్మకాలు, కొనుగోళ్లు గురువారం ప్రారంభమయ్యాయి. గురువారం స్థానిక ఒకటో వేలం కేంద్రం(18)లో 27 పొగాకు బేళ్లు, వేలం కేంద్రం-2 (32)లో 99 మేలురకం పొగాకు బేళ్ల అమ్మకానికి రైతులు సిద్ధం చేశారు. ఉదయం 8:30 గంటలకు ఒకటో వేలం కేంద్రంలో ప్రారంభమైన వేలంలో కిలో పొగాకు అధిక ధర రూ.210 లభించింది. అలాగే రెండో వేలం కేంద్రంలో కూడా అధిక ధర రూ.210 లభించింది. ఈ నేపథ్యంలో పలువురు పొగాకు రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది 30 శాతం పెట్టుబడులు పెరిగాయని పలువురు వాపోయారు. కనీసం కిలో పొగాకు ధర రూ.250 దక్కితే గానీ రైతులు కోలుకోలేరని చెబుతున్నారు. గత ఏడాది పొగాకు అమ్మకాల్లో కిలో సరాసరి ధర రూ.191 మాత్రమే లభించిందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది కనీసం సరాసరి ధర రూ.230 ఉండాలని వర్జీనియా పొగాకు రైతులు ఆశిస్తున్నారు. కొనుగోలు కంపెనీలు రైతాంగంపై దృష్టిసారించి కిలో పొగాకు కనీస ధర రూ.250 కల్పించాలని కోరుతున్నారు. లేకుంటే పొగాకు వేలం నిలిపివేస్తామని ప్రారంభ దశలోనే రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నిరాశ జనకంగా పొగాకు ధరలు : ఎపి రైతు సంఘం

వర్జీనియా పొగాకు వేలం ప్రారంభ రోజునే నిరాశజనకంగా ధరలు ఉండడం పట్ల ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో వర్జీనియా పొగాకు కొనుగోళ్లు కనీస ధర అంశంపై ఆయన మాట్లాడారు. ఉత్పత్తి ఖర్చులు దారుణంగా పెరిగిపోయాయని చెప్పారు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా ధర రాకపోతే పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వర్షాల వల్ల జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, టి.నరసాపురం మండలాల్లో వేలాది ఎకరాల్లో వర్జీనియా పొగాకు తోటలకు తీవ్రనష్టం జరిగిందన్నారు. ఈ పరిస్థితుల్లో సరాసరి ధర కిలో వర్జీనియా పొగాకు రూ.300 ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస ధరలు రాకపోతే వర్జీనియా పొగాకు రైతులు ఆందోళనలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు సిరిబత్తుల సీతారామయ్య పాల్గొన్నారు.

5న 'చలో ఢిల్లీ' విజయవంతానికి పిలుపు

పోస్టర్లు ఆవిష్కరణ

ఏలూరు:కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం, బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా వచ్చేనెల ఐదో తేదీన జరుగుతున్న చలో ఢిల్లీ పోస్టర్లను సిఐటియు, ఎపి రైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా నాయకులు గురువారం సిఐటియు జిల్లా కార్యాలయ ఆవరణలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నవరత్నాలుగా పేరొందిన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేస్తున్నారని, లేబర్ కోడ్‌ల పేరుతో కార్మిక హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టి రైతులను బిచ్చగాళ్లుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చలో ఢిల్లీ విజయవంతం కోరుతూ ఈనెల 26 నుండి 29 వరకు జిల్లావ్యాప్తంగా జీపు జాతా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, జిల్లా నాయకురాలు కె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుడు నాగరాజును విధుల్లోకి తీసుకోవాలి

ఏలూరు:అక్రమంగా తొలగించిన మున్సిపల్ కార్మికుడు ఎడ్ల నాగరాజును విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబు మాట్లాడుతూ పోస్టులు అమ్ముకునేందుకు అక్రమంగా నాగరాజుని తొలగించడం దుర్మార్గమన్నారు. నాలుగు నెలల నుంచి ఉపాధి కోల్పోయి భార్యాపిల్లలతో ఆర్థికంగా నరకయాతన అనుభవిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం సమాచారం లేకుండా విధుల నుండి తొలగించడం సరైన విధానం కాదన్నారు. నాలుగు నెలల నుండి ప్రజాప్రతినిధుల, అధికారుల చుట్టూ నాగరాజు భార్య పిల్లలతో తిరిగినప్పటికీ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. మున్సిపల్ కమిషనర్ స్పందించి నాగరాజుని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో మున్సిపల్ ఆఫీస్ వద్ద టెంటు వేసి కుటుంబ సభ్యులతో నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాథరావు పాల్గొన్నారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, సూర్జిత్ ఆశయాలు ఆదర్శం

వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు

భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్, హరికిషన్ సింగ్ సూర్జిత్ దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలు త్యాగం చేసిన మహనీయులని, దేశంలో మతతత్వ శక్తులు అధికారంలోకి రాకుండా దేశ లౌకికతత్వాన్ని నిలబెట్టిన గొప్ప మార్క్సిస్టు వాది హరికిషన్ సింగ్ సూర్జిత్ అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కొనియాడారు. స్థానిక పవర్‌పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో గురువారం భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి, సిపిఎం జాతీయ పూర్వ ప్రధాన కార్యదర్శి హరికిషన్ సింగ్ సూర్జిత్ జయంతి సభను ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత సూర్జిత్ చిత్ర పఠానికి ఎ.రవి, ఆ తర్వాత భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ చిత్ర పటానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన సభ్యులు చిత్రపటాల ముందు పూవ్వులు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎ.రవి మాట్లాడుతూ భగత్ సింగ్ యుక్త వయస్సులో దేశం కోసం ప్రాణాలర్పించిన గొప్ప దేశభక్తుడు అని కొనియాడారు. భగత్ సింగ్, తన తోటి విప్లవ సహచరులు రాజ్ గురు, సుఖ్ దేవ్ తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు. హరికిషన్ సింగ్ సూర్జిత్ మతతత్వ శక్తులు అధికారంలోకి రాకుండా దేశంలోని లౌకిక తత్వ పార్టీలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. దేశంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏ విధంగా నడపాలో దేశ ప్రజలకు తెలియచేసి, స్వాతంత్ర్య సమరయోధులుగా, రైతు, వ్యవసాయ కార్మిక నేతగా పని చేసిన నాయకుడు సూర్జిత్ అని తెలిపారు. 23వ ఏటనే తన ప్రాణాలను దేశం కోసం త్యాగం చేసిన భగత్ సింగ్ చివరి కాలంలో అత్యంత పరిణితి చెందిన మార్క్సిస్టుగా ఆయన వ్యవహరించారన్నారు. చనిపోయే ముందు లెనిన్ జీవిత చరిత్రకు చెందిన 'మనం ఏమి చేయాలి' అనే పుస్తకాన్ని చదివి ఈ దేశానికి ఇదే మేలుకొలుపుగా ఉంటుందని భావించారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, ఎ.శ్యామలారాణి, ఏలూరు నగర నాయకులు రామాంజనేయులు, జగన్నాథరావు, కోటేశ్వరరావు, గోపి, సత్యం, విద్యార్థి సంఘం నాయకులు లెనిన్ పాల్గొన్నారు.

ఏలూరు టౌన్ : భగత్ సింగ్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలు కొనసాగించాలని కోరుతూ పిడిఎస్‌యు ఏలూరు నగర కమిటీ ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సభను స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని ఐటిఐ(డిఎల్‌టిసి)లో నిర్వహించారు. ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కాకినాని పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నగర అధ్యక్షులు ఎం.క్రాంతి, పిడిఎస్‌యు నాయకులు సిహెచ్.యుగంధర్, ఎస్.సాయి, ఎస్‌కె.ఆబీబు, కళాశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఆశయసాధనకు యువత కృషి చేయాలని వికాస్ విద్యాసంస్థల ఛైర్మన్ వి.జగన్ తెలిపారు. డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వికాస్ విద్యాసంస్థల ప్రాంగణంలో వర్ధంతి సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి బి.యశ్వంత్, డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్, డివైఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి ఎస్‌కె.మాబుసుభాని, పి.మణి, గోపి, వెంకటరాజు, రాజేష్ ప్రిన్సిపల్ కిషోర్, సురేష్ పాల్గొన్నారు.

టి.నరసాపురం : అల్లూరి సీతారామరాజు నగర్ (కృష్ణాపురం మెట్ట) కాలనీలో సిపిఎం ప్రత్యేక గ్రామ పంచాయతీ పోరాటసమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్రత్యేక గ్రామ పంచాయతి పోరాటసమితి ఆధ్వర్యంలో టి.నరసాపురం పంచాయతీలోని ఏడు గ్రామాలను ప్రత్యేకగ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. ఈ పోరాటానికి సిపిఎం మద్దతుగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూక్యా వేణు, అనుమోలు మురళీకృష్ణ, కుంజా కిరణ్, మడకం సుబ్బాయమ్మ, షేక్ అమీనా, మడకం కుమారి, వగ్గాల లక్ష్మి, పెట్ల మంగ, తాటి బూషమ్మ, పండు వీరభద్రుడు పాల్గొన్నారు.

వేలేరుపాడు : భగత్ సింగ్, సుకదేవ్, రాజ్‌గురు వర్ధంతి సభను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొత్తూరు, సుందరయ్యనగర్‌లో నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎపి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్మల రమేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మడివి దుర్గారావు మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు కారం వెంకట్రావు, పూసం రాంబాబు, పాయం సత్యం, చంద్రరావు, బుచ్చయ్య, పరమేష్, ప్రకాష్, నాగు, నాగేంద్రబాబు ఉన్నారు.

జంగారెడ్డిగూడెంలో..

ఏలూరులో..

జీలుగుమిల్లి : భగత్ సింగ్ వారసులుగా దేశంలో మతోన్మాద శక్తులను కార్పొరేట్ శక్తులను తిప్పికొట్టేందుకు నేటి యువత ప్రజాపోరాటాలకు సన్నద్ధం కావాలని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు నల్ల భీమశంకరం, కె.సూర్య కుమారి, నాయకులు గజ్జల వెంకన్నబాబు, పసుపులేటి శ్రీను, అక్బర్, సీత, కరుణ, రమణ పాల్గొన్నారు.

ఉంగుటూరు : నారాయణపురంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రవికుమార్, పివి.నరసింహారావు, గౌరవ అధ్యక్షులు శీతాల సత్యనారాయణ, ఉంగుటూరు ప్రధాన కార్యదర్శి డాకి జోగినాయుడు, జిల్లా కార్యదర్శులు శ్రీధర్, కమల్, జిల్లా కార్యవర్గ సభ్యులు తులసీలక్ష్మి, ఉపాధ్యక్షులు హరికృష్ణ, వాణి, మండల అధ్యక్షులు వునుముల రాంబాబు, సీనియర్ నాయకులు, యుటిఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిడమర్రు : భగత్ సింగ్ వర్ధంతి సభ భువనపల్లి బస్టాండ్ ఆవరణలో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, కోన శ్రీనివాసరావు, వరప్రసాద్, లావేటి చంద్రరావు, బాపిరాజు, సూరిబాబు, పగడం మణికంఠ పాల్గొన్నారు.

ఏలూరు : స్థానిక గాంధీనగర్ మున్సిపల్ హై స్కూల్లో భగత్ సింగ్ వర్ధంతి సభ నిర్వహించారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు హై స్కూల్ హెచ్‌ఎం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ భగత్ సింగ్ పోరాటపటిమను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ మున్సిపల్ హై స్కూల్ ఉపాధ్యాయులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు.

చింతలపూడి : భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ని స్ఫూర్తిగా తీసుకుని మతోన్మాద పాలకపక్షాల ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి టి.రాజు అన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నుంచి కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, పద్మ, ఎస్‌కె.జానీ, ఎఐటియుసి ఏరియా అధ్యక్షులు తొర్లపాటి బాబు, ఎఐవైఎఫ్ నాయకులు వడ్డే రామారావు, బత్తుల రఘు, బొంతు నవీన్, విజయ్, శేఖర్, వంశీ, అంబేద్కర్, ముఠాకార్మికులు నాగేశ్వరావు, అప్పారావు, కె.వీరయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

నూజివీడు : భగత్ సింగ్ వర్ధంతిని సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలోని 10, 15 వార్డుల్లో నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు, పట్టణ కార్యదర్శి ఎన్‌ఆర్.హనుమాన్లు, నాయకులు నాగరాజు, ఆంజనేయులు, జిలాని, ఏసుదాస్, నాగమల్లేశ్వరరావు, నాగేంద్ర పాల్గొన్నారు.

ఉంగుటూరు మండలం నారాయణపురంలో..

జంగారెడ్డిగూడెం : భగత్ సింగ్ ఆశయాలు నేటి యువత నెరవేర్చాలని సిఐటియు పట్టణ అధ్యక్షులు పి.సూర్యారావు పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాగడాలతో నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఎస్‌కె.సుభాషిణి, వంగా గోపి, జీవరత్నం, బొడ్డు రాంబాబు, మాబు సుభాని, అందుగుల ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

సిఎం సారూ.. జిల్లా సమస్యలు పట్టించుకోరూ..!

ముఖ్యమంత్రికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి బహిరంగ లేఖ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని ప్రధాన సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ సిఎం జగన్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి బహిరంగ లేఖరాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సిఎం ఎజగన్ పలుమార్లు పర్యటించారని, తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాల అమలు ప్రారంభం, విస్తరణవంటి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారన్నారు. ఆయా సందర్భాల్లో ఈ జిల్లా ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి ప్రకటనలూ, చర్యలూ ఉండటం లేదన్నారు. ఈ సారైనా జిల్లా సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యలు స్వయంగా తెలియజేసేందుకు తమ ప్రభుత్వం అవకాశమివ్వకపోగా తమరు పర్యటించినప్పుడల్లా ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నేతలను గృహ నిర్బంధం, అరెస్టులు వంటివి సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అక్రమ చర్యల్ని చట్టబద్ధంగా చేసుకొనేందుకు బ్రిటీష్ కాలంనాటి చట్టాల ఆధారంగా జిఒ నెం. తెచ్చి మరింత ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రధాన సమస్యల్లో కొన్నింటిని తమకు బహిరంగ లేఖ ద్వారా తమ దృష్టికి తీసుకొస్తున్నామన్నామని తెలిపారు.

ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పొగాకు, మొక్కజొన్న, మిర్చి, మామిడి, జీడిమామిడి తదితర పంటల రైతులు నష్టపోయారని, వీరికి పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు చెందిన పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ఆధారంగా పునరావాస ప్యాకేజీ ఇవ్వాలని, శ్మశానవాటికలతో సహా అన్ని మౌలిక వసతులు కల్పించి ఆర్అండ్ఆర్ కాలనీని వెంటనే పూర్తి చేసి నిర్వాసితులకు ఇవ్వాలన్నారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం ద్వారా పోడు సాగుదారులకు రెండో రోడ్ మ్యాప్ నిర్వహించి సాగు పత్రాలివ్వాలని, 1/70 చట్టం, పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఇంప్లీడ్ కావాలని, ఎల్‌టిఆర్ భూమి సాగుదారులకు పట్టాలివ్వాలని, జిఒ నెం.3ను యధాతథంగా అమలు చేయాలని కోరారు. కొల్లేరులోని ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని, రెగ్యులేటర్ల నిర్మాణం వెంటనే చేపట్టాలని, కాలుష్యాన్ని అరికట్టాలని, వారి ఉపాధికి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దెందులూరు మండలంలోని దోసపాడు, కొవ్వలి, పోతునూరు గ్రామాల్లోని దళితుల భూములు ఆక్రమించి ఆక్వాసాగు చేస్తున్న వారిపై 9/77 చట్టం ఆధారంగా చర్యలు చేపట్టాలని, తక్షణం అసైన్డ్, సీలింగ్ భూములు దళితులు, పేదలకు తిరిగి అప్పగించాలని, భూ పంపిణీ దశమ రత్నంగా చేర్చి అమలు చేయాలని డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం మండలాల్లోని ఎర్రకాలువ రిజర్వాయర్ మిగులు భూములు స్థానిక పేద దళితులు, గిరిజనులకు సాగుకు ఇవ్వాలని, ప్రభుత్వానికి భూములమ్మి అక్రమంగా సాగు చేస్తున్న భూస్వాములపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

జీలుగుమిల్లి నావికాదళ ఆయుధ ఫ్యాక్టరీ నిర్మాణయోచన విరమించాలని డిమాండ్ చేశారు. ఏలూరులో మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేసి అడ్మిషన్లు ప్రారంభించాలని, ఏలూరు, దెందులూరులో ఏరియా ఆసుపత్రులు నిర్మించాలని, ఏలూరు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో 350 పడకలు కొనసాగించాలని, 40 పోస్టులు భర్తీ చేయాలని, ఆసుపత్రుల్లో అన్ని రకాల పరీక్షలు, మందులు ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడులో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని, జగనన్న ఇళ్ల కాలనీ నిర్మాణంలో ఇంటికి ఆరు లక్షల రూపాయల చొప్పున కేటాయించి ప్రభుత్వం నిర్మించాలని, అర్హత కల్గిన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని కోరారు. స్కీమ్ వర్కర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కెఆర్.పురం ఐటిడిఎకు పూర్తిస్థాయిలో ఐఎఎస్ అధికారిని పిఒగా నియమించాలని, ఐటిడిఎలోని ఖాళీ పోస్టుల్లో పూర్తిస్థాయి అధికారులను నియమించాలని కోరారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం, గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.40 లక్షల పరిహారం ఇవ్వాలని, ఎత్తిపోతల పథకానికి తగు నిధులు కేటాయించి, నిర్మాణం చేపట్టాలని, చింతలపూడి సాంఘీక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలకు సొంత భవన నిర్మాణం తక్షణం పూర్తి చేయాలన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి

ప్రజాశక్తి - చింతలపూడి

భారతదేశంలో కార్పొరేట్ శక్తుల దోపిడీ, మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలు, కార్మికులు ఉద్యమాలు చేయాలని, అందుకోసం ప్రజాతంత్ర శక్తులు కృషి చేయాలని సిపిఎం పట్టణ అధ్యక్షులు ఎస్.సూర్యకుమార్, కె.అనురాధ అన్నారు. పట్టణంలో ప్రజాసంఘాల కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పి.రంగయ్య ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ రామిశెట్టి సత్యనారాయణ, మంచెం వరలక్ష్మీదేవి, డి.సత్యనారాయణ, జె.వేణుమ్మ, ఆర్.ధర్మారావు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు. భగత్ సింగ్ చిత్రపటానికి డివైఎఫ్ఐ నాయకులు టి.శ్రీనివాస్, సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు.

వాట్రాయి : మండలంలోని చిన్నంపేట గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్ము ఆనందం మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఆశయాలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో మోహనరావు, లక్ష్మణ, వంటి, దుర్గారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మజ్జిగ కలిపిన జావ అందజేత

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

మజ్జిగ కలిపిన జావ దాహార్తులకు అందించడం అభినందనీయమని ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. ఏలూరు సత్యసాయి సేవా సంస్థల వారి ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ బజార్ పైడేటి రామారావు షాపు వద్ద ఏర్పాటుచేసిన మజ్జిగ కలిపిన జావ కేంద్రాన్ని నూర్జహాన్ పెదబాబు బుధవారం ప్రారంభించి దాహార్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సత్య సాయి సేవ సంస్థల ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. అనారోగ్య బారిన పడిన వారిని, అగ్ని ప్రమాదాలు, వరద బాధితులను, అనాధలను, పేద విద్యార్థులను ఆదుకోవడంలో వీరు ముందుంటారన్నారు. కోవిడ్ సమయంలో సత్యసాయి సేవా సంస్థల చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఎనిమిదో డివిజన్ కార్పొరేటర్ వంకదార ప్రవీణ్, పైడేటి రామారావు, వేమూ కోటేశ్వరరావు, లక్ష్మా గోపి పాల్గొన్నారు.

ఘనంగా ముద్దరబోయిన పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - నూజివీడు

టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. 19వ వార్డు టిడిపి ప్రెసిడెంట్ తుమ్మలపల్లి అశోక్ ఆధ్వర్యంలో మండలంలోని తుక్కులూరు జెబిఎల్ వృద్ధాశ్రమంలో ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు, పోషకాహారం పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా టిడిపి యువనేత తుమ్మలపల్లి అశోక్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో భారీ మెజారిటీతో ముద్దరబోయిన గెలుపొందాలని, అందుకు టిడిపి సైనికులు, కార్యకర్తలు పోరాడాలని పిలుపునిచ్చారు.

ఆగిరిపల్లి : ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఆగిరిపల్లిలోని శ్రీ వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. టిడిపి మండల నాయకులు ఆయనకు వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఎం.కోటేశ్వరరావు, సిహెచ్.శివరామకృష్ణ, కె.మంగయ్య, ఎం.గోపాలకృష్ణ, ఎ.శ్రీనివాసరావు, ఖాదర్‌భాషా, ఎస్.రమేష్, దావీదు, జి.రాజు పాల్గొన్నారు.

పాఠశాలలో సైన్స్ డే

ప్రజాశక్తి - పోలవరం

సైన్స్ మానవ జీవితంలో ఒక భాగమని, మనిషి చేసే ప్రతి పని సైన్స్ ఆధారమేనని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల గూటాల ప్రధానోపాధ్యాయులు కెవి.రాఘవన్ అన్నారు. క్రియ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న అనేక స్వచ్ఛంద కార్యక్రమాల్లో సైన్స్ ప్రయోగాల్లో విద్యార్థులను ఉత్తేజితులను చేయడానికి సైన్స్ డే రోజు పాఠశాల నిర్వహించిన ప్రయోగాలను పరిశీలించి వారికి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మండల పరిషత్ విద్యాశాఖాధికారి స్వరూప్, గూటాల గ్రామ పంచాయతీ సర్పంచ్ సిరిపురపు ప్రసాద్, మెంబర్ ఏలియా, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షులు సత్యనారాయణ, ఉపాధ్యాయులు శేఖర్, హనుమంతరావు, దుర్గారావు, సుబ్బారావు, రవి, యామిని పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఆటోపై తాటిచెట్టు పడి చిన్నారి మృతి

ఐదుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఆటో తాటిచెట్టు పడి ఓ చిన్నారి మృతి చెందింది. మరో ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన నూజివీడు మండలం మర్రిబందం వద్ద బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చెక్కపల్లికి చెందిన మారుమూడి చంద్ర, మారుమూడి శ్రావణి, మిట్టగూడెం గ్రామానికి చెందిన రాచప్రోలు మాణిక్యం తన మనవరాలు అనూష (2), సిద్ధార్థ నగర్‌కు చెందిన బత్తుల పరిశుద్ధం బుధవారం ఉదయం సీతారాంపురం బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి సాయంత్రం ఎవరి గ్రామాలకు వారు ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో ఆటో మర్రిబందం వద్దకు వచ్చేసరికి తాటి చెట్టు కూలి ఆటోపై పడింది. ఈ ప్రమాదంలో చిన్నారి అనూష అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన నలుగురు, ఆటో డ్రైవర్ బత్తుల జార్జి మొత్తం ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను స్థానికులు నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా, మద్యం ధ్వంసం

ప్రజాశక్తి - భీమడోలు

ఎస్ఇబి భీమడోలు సర్కిల్ పరిధిలో 2022వ సంవత్సరానికి వివిధ కేసుల్లో పట్టుబడిన నాటు సారా, మద్యం సీసాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం ధ్వంసం చేసినట్లు భీమడోలు ఇన్‌స్పెక్టర్ ఎయుబి.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎస్ఇబి డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ అమర్‌బాబు ఆధ్వర్యంలో చేపట్టినట్లు ఆయన తెలిపారు. దీనిలో భాగంగా 684.10 లీటర్ల నాటు సారా, 180 ఎంఎల్ పరిమాణంలో గల 493 డ్యూటీ పెయిడ్, 31 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను ధ్వంసం చేశామన్నారు. మధ్యవర్తులుగా భీమడోలు గ్రామ రెవెన్యూ అధికారులు వెజ్జు వినయ్‌బాబు, గంధం మార్కండేయులు వ్యవహరించారని ఆయన తెలిపారు. వీటితోపాటు మద్యం, నాటు సారాలను తరలిస్తూ పట్టుబడిన వివిధ వాహనాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యాలయం వద్ద వేలం వేసినట్లు తెలిపారు.

ఆలయ రికార్డులు దగ్ధం

నూజివీడు రూరల్ : మండలంలోని గొల్లపల్లి శ్రీ రఘునాథ స్వామి ఆలయ రికార్డులను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి దగ్ధం చేశారు. గురువారం ఉదయం ఆలయానికి వెళ్లిన ఇఒ విశ్వేశ్వరరావు తాళాలు పగలగొట్టి, రికార్డులు దగ్ధం చేసి ఉండటం గమనించారు. దీంతో ఆయన రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నూజివీడు రూరల్ సిఐ ఆర్.అంకబాబు, రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ ఆలయ కార్యాలయం గదిని పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించి సిసి ఫుటేజ్‌ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని వెంకటాద్రిగూడెం పంచాయతీ పింగులుగూడెంలో కోడిపందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పింగులుగూడెంలో వీరవల్లి శ్రీనుకు చెందిన పామాయిల్ తోటలో కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు చింతలపూడి ఎస్ఐ హరికృష్ణ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో పది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 16 బైక్‌లు, నాలుగు కోడిపుంజులు, రెండు కోడికత్తులు, రూ.20500 నగదు స్వాధీనం చేశారు.

ఇద్దరికి గాయాలు

జీలుగుమిల్లి : భూ తగాదా విషయంలో జరిగిన గొడవలో కత్తులతో దాడులు చేసుకొని ఇద్దరు గాయాలపాలైన ఘటన మండలంలోని సిర్రివారిగూడెంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిర్రివారిగూడెం గ్రామంలో ఓ భూమి విషయంలో మడకం ముత్యాలు, దారాం వెంకటేశ్వరరావు మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు కత్తులతో దాడు చేసుకోవడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని స్థానికులు జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రోగ్రాం కో-ఆర్డినేటర్

సిఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరులో శనివారం ముఖ్యమంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎంఎల్‌సి తలశిల రఘురామ్ తెలిపారు. ఈ మేరకు సభాస్థలి వద్ద అధికారులతో ముఖ్యమంత్రి పర్యటనా ఏర్పాట్లను గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల రైతుల హామీలు నెరవేర్చాలి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఎత్తిపోతల పథకంలో రైతులకు ఇచ్చిన హామీలను సిఎం జగన్ వెంటనే నిలబెట్టుకోవాలని చింతలపూడి ఎత్తిపోతల పథకం రైతుల జెఎసి సెక్రటరీ చిట్లూరి అంజిబాబు అన్నారు. పట్టణంలో మార్కెట్ యార్డు వద్ద చింతలపూడి ఎత్తుపోతల రైతులు భవిష్యత్తు కార్యచరణ కోసం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎకరానికి రైతుకు రూ.35 నుంచి 40 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రోడ్డు పక్కన విలువైన భూములకు కమర్షియల్ రేట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చింతలపూడి ఎత్తుపోతల పథకం భూ సేకరణ జిఒ ఇచ్చి ఐదేళ్లైందని, ఇప్పటివరకు నష్టపరిహారం ఇవ్వలేదని చెప్పారు. ప్రస్తుత మార్కెట్ అనుగుణంగా నష్టపరిహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రంగయ్య, గోలి రామకృష్ణారెడ్డి, విజయనంద్, బాబ్జి పాల్గొన్నారు.

డాక్టర్ స్వరూప్ దంపతులకు సత్కారం

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను గ్రామానికి చెందిన శ్రీ విఘ్నేశ్వర వికలాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో వికలాంగులకు విశేష సేవలందిస్తున్న ఏలూరుకు చెందిన వైద్యులు స్వరూప్ దంపతులను ఉగాది పురస్కరించుకుని బుధవారం సత్కరించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ క్రమంలో ప్రతినెల దాతల సహకారంతో స్థానిక వికలాంగులకు సహాయ సహకారాలు అందిస్తున్న సేవా సమితి అదే రోజు నిర్వహించిన మరొక కార్యక్రమంలో దాత దాట్ల సీతారామరాజు సహకారంతో 400 మంది వికలాంగులకు దుస్తులు, నిత్యావసర వస్తువులు, పండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. 400 మంది వికలాంగులకు ప్రత్యేకంగా అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన ప్రముఖులు దాట్ల సీతారామరాజు, కొండా గంగరాజు కుమార్‌తో పాటు ఉమ్మడి జిల్లాల వికలాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు నీలకంఠం పాల్గొన్నారు.

చిరుధాన్యం పంటలపై అవగాహన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

చిరుధాన్యాలను మన ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల కొన్ని దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలను నియంత్రణలో ఉంచుకోవచ్చని ఎంపిడిఒ కెఎం.మంగతాయారు తెలిపారు. చిరుధాన్యాల పంటలపై స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. రైతులు చిరు ధాన్యాల వైపు మొగ్గు చూపేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల కొన్ని దీర్ఘకాలిక వ్యాధులు దరికి రాకుండా చూసుకోవచ్చున్నారు. ఎపిఎం రామారావు మాట్లాడుతూ చిరుధాన్యాలను పండించే రైతులు ఎవరైనా ఉంటే కార్యాలయంలోని రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో నమోదు చేసుకుంటే వారికి ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 50 ఎకరాల్లో చిరుధాన్యాలు పండించేందుకు లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అధికారి కె.గంగాధర్, హెచ్ఇ పేరయ్య శాస్త్రి, దాసరి సామ్రాజ్యం, సిసిలు వి.దుర్గారావు, సురేష్, దాసు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై నిరసన

ప్రజాశక్తి - చింతలపూడి

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎస్‌కె.ఆజాద్ కోరారు. సేవ్ జర్నలిజం డే సందర్భంగా జర్నలిస్టుల సమస్యలపై తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ షకీలాకు వినతిపత్రం అందిచారు.

అనారోగ్యంతో బాధపడుతున్న రిపోర్టర్ అశోక్ వర్ధన్‌కు ప్రెస్‌క్లబ్ తరపున ఆజాద్ ఆర్థిక సాయం అందించారు. చింతలపూడి ఎస్ఐ డి.హరికృష్ణ చేతుల మీదుగా ఈ సాయం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సమాజ సేవలో చింతలపూడి ప్రెస్ క్లబ్ ముందుండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సీనియర్ సభ్యులు, పాత్రికేయులు కెఎస్ఎస్.వీరయ్య, ఎంఎ.జిన్నా, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సూరిబాబు, రవి, నరేష్, ముత్తేశ్వరరావు, కృపావరం, రజిని, నాగేంద్ర, అశోక్‌వర్ధన్, సంజయ్, పవన్ పాల్గొన్నారు.

న్యాయం కోరుతూ నిరసన

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

వైసిపి ప్రభుత్వంలో దళితులకు న్యాయం జరగట్లేదని మాల మహాసేన జాతీయ అధ్యక్షులు అలగ రవికుమార్ అన్నారు. కాకినాడ జిల్లాలో దళితవాడపై దాడి చేసి నడిపల్లి రామును హత్య చేసిన బాధితులకు సరైన న్యాయం చేయాలని కోరుతూ ఏలూరు అంబేద్కర్ విగ్రహం వద్ద పాత బస్టాండ్ సెంటర్‌లో మాల మహాసేన ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ బాధితులకు తగిన న్యాయం చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేసి రాష్ట్ర బంద్‌కు కూడా పిలుపునిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహాసేన స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరికపాటి విజయ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి శంకర్, రాష్ట్ర కార్యదర్శి గోలే విజయ్, ఏలూరు సిటీ ప్రెసిడెంట్ కర్ణకోటి దిలీప్, గంటా రాజేశ్వర రావు, సీనియర్ దళిత నాయకులు లంకపల్లి బాలు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని కార్మికుల ధర్నా

కెఎంఆర్ సీడ్ యాజమాన్యం హామీతో విరమణ

ప్రజాశక్తి - చింతలపూడి

వెలగలపల్లి కెఎంఆర్ సీడ్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు, సీజనల్ లేబర్లకు బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌విఎస్.నారాయణ, సిఐటియు మండల అధ్యక్షుడు నత్త వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వెలగలపల్లి గ్రామ పరిధిలో కెఎంఆర్ మొక్కజొన్న సీడ్‌లో పనిచేస్తున్న కార్మికులు ఫ్యాక్టరీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిఐటియు నాయకులు మద్దతు తెలిపి మాట్లాడుతూ కెఎంఆర్ సీడ్స్ యాజమాన్యం మూడు నెలల నుంచి కార్మికులకు జీతాలు చెల్లించకుండా కార్మిక కుటుంబాలను పస్తులతో ఉంచుతుందన్నారు. పండుగ సమయంలో కూడా కార్మికులకు జీతాలు చెల్లించకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటుందన్నారు. కార్మికులకు ఫ్యాక్టరీలో కనీస వసతులు కూడా సరిగా లేవన్నారు. ఇటీవల ఒక మహిళా కూలీ మృతి చెందినా నేటికీ ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులకు మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం శ్రద్ధ చూపటం లేదన్నారు. కార్మికులకు జీతాలు చెల్లించడంతో పాటు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించి జీతాలు చెల్లిస్తామని చెప్పడంతో కార్మికులు ఆందోళన విరమించారు.

రైతులకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు వ్యవసాయ అధికారి కె.గంగాధర్ తెలిపారు. పంట నమోదు చేసుకున్న రైతులు వారి పంట నష్టాన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలని సూచించారు. అకాల వర్షాలకు నష్టపోయిన పొగాకు, మొక్కజొన్న పంటలను గురువారం క్షేత్రస్థాయిలో తిరిగి పరిశీలించారు. మండలవ్యాప్తంగా సుమారు మొక్కజొన్న 300 ఎకరాల వరకు, పొగాకు 200 ఎకరాల వరకు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంట ఇ-క్రాప్‌లో నమోదై 33 శాతం కంటే ఎక్కువగా నష్టపోయిన

మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

పంటల వివరాలను ఆర్‌బికె అసిస్టెంట్లతో నమోదు చేపిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా పంట నష్టపోయిన రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో నమోదు తెలిపినట్లయితే సిబ్బంది క్షేత్ర స్థాయిలోకి వచ్చి పంట వివరాలు తీసుకుంటారని తెలిపారు.


ఆర్థిక సాయం అందిస్తున్న పాకనాటి సీతారామ్

అనారోగ్య బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముసునూరు

అనారోగ్యంతో బాధపడుతున్న పేద మహిళకు తెలుగు యువత మండల నాయకులు పాకనాటి సీతారామ్ ఆర్థిక సాయం అందించారు. మండలంలోని ముసునూరు గ్రామానికి చెందిన చింతా నాగరాజు భార్య తీవ్ర అనారోగ్యం బాధ పడుతోంది. విషయం తెలుసుకున్న సీతారామ్ ఆమెకు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నూజివీడు నియోజకవర్గ బిసి నాయకులు నకా యోహాను పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని అక్కిరెడ్డిగూడెం సెక్టార్ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషహాకారం అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో బాలింతలకు, గర్భిణులకు ఇచ్చే పోషకాహారంపై అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు, ఆయాలకు అవగాహన కల్పించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఈ నెల 24వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కెఎం.అంబేద్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు టి.నరసాపురంలోని 33 కెవి, టి.నరసాపురం ఫీడర్ పరిధిలోని 33/11 కెవి టి.నరసాపురం, రాజుపోతేపల్లి, మక్కినవారిగూడెం, బండివారిగూడెం, తిరుమలదేవిపేటలో ఉన్న విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో విద్యుత్ అంతరాయంతో పాటు వ్యవసాయ వినియోగదారులకు విద్యుత్ వేళల్లో మార్పులు ఉంటాయని, ప్రజలు సహకరించాలని కోరారు.

హుండీల లెక్కింపు

ప్రజాశక్తి - కైకలూరు

శ్యామలాంబ ఆలయ క్షేత్రంలో గురువారం హుండీ ఆదాయాన్ని తనిఖీ అధికారి దేవాదాయ ధర్మాదాయ శాఖ గుడివాడ వారి పర్యవేక్షణలో ధర్మకర్తల మండలి సమక్షంలో లెక్కించారు. మూడు నెలల 20 రోజులకు రూ.2,28,767 ఆదాయం సమకూరింది. భక్తులు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ గుర్రం రాంబాబు, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు. రామలింగేశ్వర స్వామి దేవస్థానం హుండీ ఆదాయం మూడు నెలల 20 రోజులకు రూ.27,245 వచ్చింది. వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో హుండీ ఆదాయం మూడు నెలల 20 రోజులకు రూ.1,31,986 వచ్చింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి విఎన్‌కె.శేఖర్ తెలిపారు.

ప్రజలు శాంతి, సామరస్యంతో మెలగాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ప్రజలు శాంతి, సామరస్యంతో మెలగాలని భారతదేశ వాటికన్ రాయబారి మహాఘనత వహించిన ఆర్చ్ బిషప్ లియోపోల్డో జిరెల్లి ప్రబోధించారు. ఏలూరు కతోలిక పీఠాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఏలూరులోని పీఠంలో అధికారులను, సర్వమతాలను, అన్ని రాజకీయ పార్టీల పెద్దలు ఏలూరు పీఠాధిపతి బిషప్ జయరావ్ పొలిమేర ఆధ్వర్యంలో వాటికన్ రాయబారిని కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. మహావీర్ జయంతి సందర్భంగా వాటికన్ సిటీ నుంచి వచ్చిన సందేశాన్ని ఏలూరులోని జైన్ సంఘ నాయకులు విజయకుమార్ జైన్‌కు స్వయంగా అందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారి శామ్యూల్, ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, టిడిపి ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడేటి రాధాకష్ణయ్య (చంటి), బిజెపి రాష్ట్ర నాయకులు గారపటి చౌదరి (తపన చౌదరి) అంబికా సంస్థల ఛైర్మన్, మాజీ ఎంఎల్ఎ అంబికా కృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ ప్రతినిధి రాజనాల రామ్మోహన్‌రావు, బిషప్ జయరావ్ పొలిమేర మాట్లాడారు. అందరూ బాగున్నారా అంటూ వాటికన్ రాయబారి జిరెల్లి అచ్చ తెలుగులో అతిథులను ఆత్మీయంగా పలకరించారు. ప్రపంచ మానవాళి సంక్షేమమే వాటికన్ సందేశమని, విద్య, ఉద్యోగం, ఆరోగ్యం సహా పలు రంగాల్లో ప్రజలకు సేవలు అందించటమే లక్ష్యమని తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - గణపవరం

మండల కేంద్రమైన గణపవరం ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా కృషి చేస్తున్నట్లు ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు (వాసు బాబు) అన్నారు. స్థానిక సువర్ణ గుండం మంచినీటి చెరువులో రూ.15 లక్షలతో పూడిక తీత పనులు పూర్తయిన సందర్భంగా బుధవారం మంచినీటి చెరువుకు నీరును వదిలిపెట్టే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపవరంలో జల జీవన పథకం పనులు చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు. రానున్న రోజుల్లో ప్రతి ఇంటికి పైపులైన్ ద్వారా తాగునీరు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మూర అలంకారం భాస్కరరావు, ఉప సర్పంచి దండు రాము, సూరి బలిజ రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, గణపవరం మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు సలాది రత్న దుర్గకుమారి వైసిపి నాయకులు పాల్గొన్నారు.

14న సామూహిక గృహ ప్రవేశం

భీమడోలు : గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఉగాదికి సామూహిక గృహ ప్రవేశాలు కార్యక్రమం వివిధ కారణాల వల్ల వాయిదా పడిందని ఆ సంస్థ భీమడోలు సహాయ ఇంజినీర్ సతీష్ తెలిపారు. తిరిగి ఈ కార్యక్రమాన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏప్రిల్ 14వ తేదీ అంబేద్కర్ జయంతి సందర్భంగా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే మండలానికి కేటాయించిన లక్ష్యాల్లో 79 శాతం గృహ నిర్మాణాలు చేపట్టిన భీమడోలు మండలం జిల్లాలో నాలుగో స్థానంలో ఉందని ఆయన తెలిపారు. రానున్న కాలంలో లబ్ధిదారులను చైతన్యపరిచి ఆ స్థానాన్ని మరింత మెరుగుపర్చేందుకు ఇతర అధికారుల సహాయంతో చర్యలు తీసుకోనున్నట్లు ఆయన చెప్పారు.

రావిచర్లలో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర బృందం మండలంలోని రావిచర్ల గ్రామాన్ని బుధవారం సందర్శించింది. ఈ సందర్భంగా కేంద్ర బృంద సభ్యులు మధు, బాలగంగాధర్‌తో పాటు గ్రామ సర్పంచి కాపా శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి సరస్వతి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో స్వచ్ఛభారత్ అమలు ఇతర అభివృద్ధి కార్యక్రమాలను కేంద్ర బృందం సభ్యులకు సర్పంచి వివరించారు.

రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - చింతలపూడి

స్థానిక ప్రభుత్వ ఏరియా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు టిడిపి చింతలపూడి నియోజకవర్గ నాయకులు, మిషన్ హోప్ స్వచ్ఛంద సంస్థ అధినేత సొంగా రోషన్‌కుమార్ పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు సేవ చేయటం అదృష్టంగా భావిస్తానన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు.

అనురాధ గెలుపుపై టిడిపి హర్షం

ప్రజాశక్తి - కలిదిండి

ఎంఎల్ఎ కోటాలో జరిగిన ఎంఎల్‌సి ఎలక్షన్స్‌లో టిడిపి తరపున బరిలో నిలిచిన పంచుమర్తి అనురాధ గెలుపొందడంతో టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కలిదిండి ప్రధాన సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. బాణాసంచా కాల్చారు. స్వీట్స్ పంపిణీ చేశారు. టిడిపి మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు నున్న రమాదేవి, నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ లంకా రత్నారావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : టిడిపి యువనేత కొడాలి వినోద్ ఆధ్వర్యంలో ముదినేపల్లిలోని వైకుడలి వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పెద్దఎత్తున పార్టీ నేతలు బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు.

In the Court of the Principal Junior Civil Judge, Tanuku

E.P. No. 70/2022 in **O.S. No. 557/2019**

DHR/ Plaintiff:
Sarakadam Padmavathi
JDR/ Defendant:
(1) Sathi Srinivasa Reddy, S/o. Satyanarayana Reddy, D.No. 3-21, Kommara, Attili Mandalam, PJCJC.

పై నెంబరు E.P. లో మీరు (JDR-1) Order 21, Rule 54 and Rule 66 Notice తీసుకొనకుండా Evade చేయుచున్నందున **ది. 28-3-2023వ తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు కాని యెడల పరోక్షమందు తీర్మానించబడును.

D.RADHA
D.RAVIKUMAR
Advocates, Tanuku
Cell: 9885012183
Tanuku
23-3-2023

HIGH COURT OF ANDHRA PRADESH AT :: AMARAVATHI

AS.NO. 134/2022

Between :
Smt.D.Lakshmi Devi ....APPELLANT
AND
Uppalapati Padmanabha Raju & others ....RESPONDENTS

To
1) Smt.Dantuluri Rohini D/o Late. Lakshmipathi Raju, R/o Kowada (village) West Godavari Dist.,- 534 202.
2) Smt.Dantuluri Indira D/o Late. Lakshmipathi Raju, R/o Avanam (village) Bhogapuram (Mandal) - 535 216 Vizianagaram Dist.,
Madam

My client Smt. D.Lakshmi Devi filed AS.No.134/2022 on the file of Hon'ble High Court of Andhra Pradesh at Amaravathi against Judgment and Decree Dt.19.07.2016 in OS.No.206/2007 on the file of court of XIII Addl.District Judge, Gajuwaka. You arrayed as respondent Nos.5 and 6 in the said appeal. The said appeal is now stands posted to **19.04.2023** for your appearance either in person or through advocate on that day at **10.30** AM, failing which, the appeal would be decided in your absence.

(BY ORDERS OF HONOURABLE HIGH COURT)

Sd/- **G. PADMAVATHI SRINIVAS**
COUNSEL FOR APPELLANT
HIG-463, HOUSING BOARD COLONY,
NEAR.CHURCH CENTRE,
BHAVANIPURAM
VIJAYAWADA
PHONE: 7032870159

In The Court Of The Principal Senior Civil Judge :: Eluru

E.P.No. 75/2018
A.A.C.F.No. 82/2012

Between:
M/s. Margadarsi Chit Fund Pvt. Ltd., Rep.by its Manager, Kakinada. ***...Decree Holder***
AND
P.V.S.Subba Lakshmi and Others ***...Judgement Debtrs***

2వ జె.డి.ఆర్: పుణ్యమూర్తుల వెంకట విశ్వ సుందర రావు, తండ్రి: వెంకట కేశవ కృష్ణారావు, శివ ఎస్టేట్, ఫ్లాట్ నెం. 401, బి-బ్లాక్, కొత్త అశోక్ నగర్, జూట్‌మిల్ ప్రాంతం, ఏలూరు.

పై నెంబరు అమలు గ్రంథములో ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారి ఎదుట **ది. 03-04-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు వేలం నిర్వహించబడును.** ఆసక్తి కలవారు వచ్చి పాడుకొనగలరు. వివరములకు డిక్రీ హోల్డర్ గారి అడ్వకేట్ గారి ఆఫీసులో తెలియజేయబడును.

SCHEDULE OF PROPERTY BELONGING TO 2nd J.D.R

All that the pieces and parcel of that residential site situated at West Godavari District, Eluru Sub Rigistrar Office, Uppugudem Village, Denduluru Mandal having S.No. 403/2 covered by an extent of 1300 Sq. Yards of vacant site is bounded by: ***North:*** 12 Ft. Wide Joint way Ft. 157.9. ***South:*** Site of Bakkatattu Adiaiah Ft. 157.9. ***East:*** Site of Executant Ft. 74.2. ***West:*** Road Ft. 74.2.

Within the above boundaries an extent of 1300 Sq. Yards of vacant site with all super structures, water ways, common ways and easementery rights.

DHR Value : Rs.6,00,000/-
Amina Value : Rs.9,00,000/-
JDR Value : Not Given

పి.పూర్ణ చంద్రజోషి
అడ్వకేట్, ఏలూరు. సెల్: 98481 73333

MUNICIPAL CORPORATION, ELURU

e-PROCUREMENT TENDER NOTICE No: 223-231/15th FC, NCAP & General/2022-23, Dated. 21-03-2023

The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from interested, eligible bidders for **"Supply and delivery of JCB mini Excavators, JCB Tracked Excavator, Special purpose vehicle mounted suction machine, Skid steer loader, Sky lift Hydraulic, Dust suppression using tractor mounted with water tanker and sprinkler, Providing Greenery, Providing Model Smart Street & Supply delivery and fixing of Computers and accessories in Municipal Corporation, Eluru"** Total No. of works is **9** with an amount of Rs. **381.99** Lakhs.

Tender schedules are available on e-procurement market place from 24-03-2023. Last date of receipt of tenders is 06-04-2023. Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-245990).

Sd/- **COMMISSIONER,** MUNICIPAL CORPORATION, ELURU

MUNICIPAL CORPORATION, ELURU

Expression of Interest

Dt.21-03-2023

The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from interested, eligible Petrol/ Diesel authorized agencies/ dealers for **"Supply and filling of Diesel, Petrol and other Lubricants to the Vehicles of Engineering & Public Health wings of Municipal Corporation, Eluru".**

Bid Documents may obtain from Engineering Section on or before Dt. 10-04-2023 upto 5.00 P.M on payment of Rs. 1,000/- in favour of Commissioner, Municipal Corporation, Eluru in the shape of demand draft. Last date of receipt of Bids is 3.00 P.M. on 12-04-2023. For further details, can be contact Executive Engineer, Municipal Corporation, Eluru, Eluru District (Phone 9849907146).

Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU

గ్రామపంచాయతీ కార్యాలయము - పెదఅమిరం

రి.క.నెం. టెండరు/2023 **సీల్డు టెండరు నోటీసు** తేది. 23-03-2023

ది.28-03-2023 సంవత్సరం తేదీ మంగళవారం మధ్యాహ్నం 03:00 గం॥ల వరకు దిగువ సంతకము దారునిచే ఈ దిగువ షెడ్యూలు దాఖలా కాంట్రాక్టు పనులు, అయిటములు సరఫరా నిమిత్తము సీల్డు టెండర్లు స్వీకరించి అదే రోజు హాజరైన టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరవబడును. ధరావత్తులు చెల్లించని, అసంపూర్తి, దిద్దివేతలు, కొట్టివేతలు గల టెండర్ల టెండరు తిరస్కరించబడును. ఎట్టి కారణము చూపకనే ఏ టెండరునైనా ఆమోదించుటకు, తిరస్కరించుటకు పంచాయతీ కార్యదర్శి వారికి పూర్తి అధికారములు గలవు. వివరములు ఈ దిగువ సంతకముదారు నుండి ఈ కార్యాలయం పని వేళల్లో అడిగి తెలుసుకొనవచ్చు.

వ.నెం	పని వివరములు	కాలపరిమితి	పనివారి వివరము	ధరావతు
1	ప్రజారోగ్య పనివారు ఏజెన్సీ ద్వారా	2023-24	20 మంది	20000/-
2	నీటి సరఫరా పనివారు, ఎలక్ట్రిషియన్ పనివారు	2023-24	19 మంది	200/-చొప్పున
3	SWM షెడ్ వాచ్ మెన్	2023-24	01	200/-
4	నీటి సరఫరా సామాగ్రి సరఫరా	2023-24	-	10000/-చొప్పున
5	ప్రజారోగ్య సామాగ్రి సరఫరా	2023-24	-	10000/-చొప్పున
6	విద్యుత్ అవసర విడిభాగముల సరఫరా	2023-24	-	10000/-చొప్పున
7	స్టేషనరీ సామాగ్రి సరఫరా	2023-24	-	10000/-చొప్పున

సం/- **డొక్కు సోమేశ్వరరావు**
సర్పంచ్, పెదఅమిరం,
కాళ్ళ మండలం, ప॥గో॥జిల్లా

సం/- **పి.కనకరావు**
గ్రామ కార్యదర్శి, పెదఅమిరం
కాళ్ళ మండలం, ప॥గో॥జిల్లా